## క్లుప్తంగా

### జీఎస్టీ తగ్గింపుతో వైద్య ఖర్చుల్లో ఆదా



అవగాహన ర్యాలీ చేస్తున్న ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది

**సీతంపేట:** జీఎస్టీ 2.0 ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు నరసింహనగర్ యూపీహెచ్‌సీ వైద్యుడు మనోజ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 43వ వార్డు దాడి రామ్మూర్తి కల్యాణ మంపడం వద్ద ప్రారంభమైన ర్యాలీ శ్రీనివాసనగర్, నంద గిరినగర్, జగన్నాథపురం ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణ ఫలితంగా వైద్య సేవలు పేదలకు మరింత అందుబాటులోకి వచ్చాయన్నారు. జీవిత భీమా, ఆరోగ్య భీమాపై గతంలో ఉన్న 18 శాతం జీఎస్టీ ఇపుడు పూర్తిగా తొలగించారన్నారు. మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్, వివిధ రకాల మందులు, దృష్టి సరి చేసే కళ్లద్దాలపై గతంలో 12 శాతం జీఎస్టీ ఉండగా.. దానిని 5 శాతానికి తగ్గించారన్నారు. 36 రకాల ప్రాణ రక్షక, క్యాన్సర్ వంటి అరుదైన వ్యాధుల మందులపై గతంలో ఉన్న 12.5 శాతం జీఎస్టీ పూర్తిగా తొలగించారని తెలిపారు. వీటితో వైద్య ఖర్చుల్లో భారీ ఆదా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### ముగిసిన రచయిత్రుల జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

**కంచరపాలెం:** సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్న రచయిత్రుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఏయూ హిందీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్. సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు, లీడర్ దినపత్రిక ఎడిటర్ వి.వి. రమణమూర్తి, విశిష్ట అతిథి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ టి. సత్యనారాయణ రచయిత్రుల కృషిని అభినందించారు. సదస్సు కన్వీనర్, కళాశాల కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి నేతృత్వంలో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ జె.నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్ల ముందు మురుగు ప్రవాహం



సీతంపేట బాపూజీ వీధి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

**సీతంపేట:** జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట బాపూజీ వీధిలోని 50–77–17 ఇంటి నంబర్ వద్ద మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహించింది. డ్రెయిన్‌లో సిల్ట్, పూడికలతో నిండి పోవడంతో మురుగు నీరు, వ్యర్థాలు ఇళ్ల ముందు నుంచి ఏరులై ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. డ్రెయిన్లల్లో వ్యర్థాలను సక్రమంగా తరలించక పోవడంతో తరచూ మురుగు రోడ్డెక్కి ప్రవహిస్తోందని స్థానిక మహిళలు మండిపడుతున్నారు. ఇళ్ల ముందు మురుగు నీటి ప్రవాహంతో బయట కాలుపెట్టలేక పోతున్నామని, సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్లలో వ్యర్థాలు, పూడిక తొలగించి సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

### భారీ అన్నదానం

**కంచరపాలెం:** జ్ఞానాపురం న్యూ రైల్వే స్టేషన్ రహదారిలో ఆటో, ట్యాక్సీ స్టాండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మహా అన్నసమారాధన నిర్వహించారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు శ్రీధర్ హాజరై అన్న సమారాధనను ప్రారంభించారు. సుమారు 5 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వార్డులోని ఆటోడ్రైవర్లకు వైఎస్సార్‌సీపీ తరఫున అండగా ఉంటామని పూర్ణిమ, శ్రీధర్ భరోసా ఇచ్చారు.

# వరుస చోరీలు.. జనం బెంబేలు





ఇటీవల ఇందిరానగర్‌లోని ఓ ఇంట్లో బీరువా తెరిచి చోరీ చేసిన దృశ్యం

- కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగల హల్‌చల్
- తాళం వేసిన ఇళ్లు, ఒంటరి మహిళలు, వృద్ధులే టార్గెట్‌గా దొంగతనాలు
- పోలీసుల నిఘా లోపమే కారణమంటున్న స్థానికులు




కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్

**మర్రిపాలెం:** కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోరీలు ఎక్కువయ్యాయి. ఇళ్లలో దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, బైకులు, పెట్రోలు ఇలా అన్ని రకాల దొంగతనాలు నిత్యకృత్యంగా మారాయి. ద్విచక్ర వాహనాలపై సంచరిస్తున్న యువకులు ముఖ్యంగా ఒంటరి మహిళలు, వృద్ధులను టార్గెట్ చేసుకుని దొంగతనాలు చేయడానికి చెలరేగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇటువంటి ఘటనలు జరగడం కలకలం రేపుతోంది. ఐదో పట్టణ క్రైం పోలీసుల నిఘా లోపం వల్లే ఇళ్లల్లో దర్జాగా దొంగతనాలు చేసేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని ఎంచక్కా చోరీలకు పాల్పడుతూ దొరికినంత దోచుకుపోతున్నారు.

**మాటలతో మభ్యపెట్టి చైన్ స్నాచింగ్‌లు**

నగరంలో అనేక చోట్ల రెండు మూడు నెలల నుంచి వరుస దొంగతనాలు జరిగిన విషయం తెలిసిందే. నెల రోజుల కిందట కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా చైన్ స్నాచింగ్‌లు జరిగాయి. జ్ఞానాపురం, కంచరపాలెం, ఇండస్ట్రియల్ ఎస్టేట్, బిర్లా జంక్షన్.. ఇలా ఒకే సారి నాలుగు చోట్ల బైకుపై ఇద్దరు నిందితులు వచ్చి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఒకరు బైకుపై సిద్ధంగా ఉంటే.. మరొకరు ఒంటరి మహిళలను టార్గెట్ చేసి వారిని మాటలతో మభ్యపెట్టి అడ్రస్‌లు అడిగి వారు సమాధానం చెప్పేలోపే వారి మెడలో గొలుసులు తెంచి పరారయ్యారు. నాలుగు చోట్ల కలిపి సుమారు 13 తులాల బంగారు గొలుసులు తెంపుకుని వెళ్లిపోవడం సంచలనమనే చెప్పాలి. ఆ సమయంలో ఊర్లో సీఎం ఉన్నారని, ఆయన ఉన్నప్పుడే ఇలాంటి ఘటనలు జరగడం పెద్ద దుమారమే రేపింది.

**తాళం వేసిన ఇళ్లే టార్గెట్**

పండగలు, శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల సమయంలో ఊరెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారమందించాలని, విలువైన వస్తువులు బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని పలుమార్లు చెబుతున్నప్పటికీ కొందరు ప్రజల్లో అవగాహన లోపంతో తెలియ పరచడం లేదు. తాజాగా దసరా సెలవులకు చాలా మంది ఇళ్లకు తాళాలు వేసి ఊరెళ్లారు. అటువంటి ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగలు దొరికనంతా దోచుకుపోతున్నారు. ఊరెళ్లి ముందు పోలీసులకు సమాచారం అందించి ఉంటే ఇళ్ల దొంగతనాలు జరగకుండా ఉండేవి కాదని పలువురు చెబుతున్నారు. పోలీసులు కూడా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడితే చోరీలను నియంత్రించ వచ్చని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.



సీసీ టీవీ ఫుటేజీ దృశ్యాల్లో నిందితుల కదలిక(ఫైల్)

**దారి దోపిడీలు**

గతంలో రాత్రి వేళల్లో తాటిచెట్లపాలెం, కంచరపాలెం, ఐటీఐ కూడలి వద్ద దారి కాసి అటుగా వెళ్తున్న వాహన చోదకులు, పాదచారులపై దొంగలు దాడి చేసి వారి వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్లు వంటివి అపహరించుకుపోయారు. పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా నామమాత్రంగా ఉండటమే తప్ప పెద్దగా ఫలితం కనిపించలేదు.

**ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం**

ప్రతి సచివాలయంలోనూ మహిళా పోలీసులు ఉన్నారు. వీరి ద్వారా క్రైం పోలీసులు ప్రజల్లో అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైనా ఊరెళ్తే ముందు లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్ ద్వారా ఇంటి వద్ద పోలీస్ నిఘా ఉంటుందని ఇంకా కొంతమందికి తెలియని పరిస్థితి ఉంది. ఎప్పటికప్పుడు పోలీస్ యంత్రాంగం ప్రజల్లో అవగాహన చేపడుతున్నప్పటికీ వారికి చేరడం లేదంటే ఎవరి నిర్లక్ష్యమో తెలియడం లేదని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొంగతనాలు సరే.. రికవరీ జరుగుతుందా అంటే అదీ కూడా అంతంతమాత్రంగానే ఉంటోందని ఫిర్యాదుదారులు చెబుతున్నారు. పోలీసులు నిఘా పెంచి దొంగతనాలను అరికట్టేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక స్థిరత్వం



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న లచ్చయ్య

**మురళీనగర్:** జీఎస్టీ–2.0 సంస్కరణల వల్ల ఆర్థిక స్థిరత్వం ఏర్పడుతుందని నైపుణ్య శిక్షకుడు లచ్చయ్య జయంతి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ అధ్యక్షతన గురువారం జీఎస్టీ సంస్కరణలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం తగ్గించిన జీఎస్టీ శ్లాబ్‌ల వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మేలు చేకూరుతుందని, ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా జరుగుతాయని వివరించారు. దీని వల్ల విద్యారంగానికి కలిగే ప్రయోజనాలకు విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో కె.హరిబాబు, కె.వాసు, ఎ.నిఖిల్ సాయి మొదటి మూడు స్థానాల్లో, వ్యాసరచన పోటీల్లో పి.వి.జి.వైష్ణవి, కె.ప్రభ, వై.హస్విత మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేలకు లచ్చయ్య జయంతి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించి అభినందించారు.

### మధ్యవర్తిత్వ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

**విశాఖ–లీగల్:** జిల్లాలో 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణ కోసం అర్హులైన సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, సబ్జెక్టు నిపుణులు నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల జిల్లాలో గల సంబంధిత న్యాయవాదులు సంఘం నుంచి జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

## డిసెంబర్ 27న కూచిపూడి కళావైభవం



కళావైభవం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న భరత్ ఆర్ట్స్ ఫౌండర్ డైరెక్టర్ లలితారావు

**సీతంపేట:** డిసెంబర్ 27న హైదరాబాద్ వేదికగా కూచిపూడి కళావైభవం అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు భరత్ ఆర్ట్స్ ఫౌండర్ డైరెక్టర్ లలితారావు తెలిపారు. ద్వారకానగర్‌లోని బాబాపూ భవన్‌లో గురువారం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భరత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 7,209 మంది కూచిపూడి కళాకారులతో కలిసి గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో ప్రపంచ రికార్డు సాధనకు పెద్ద ఎత్తున కళావైభవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమ అనంతరం గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు గిన్నిస్ బుక్‌లో వివరాలు నమోదు చేసి అధికారికంగా ప్రకటిస్తారన్నారు. కళావైభవంలో పాల్గొన దలచిన కూచిపూడి కళాకారులు 95151 12939, 62815 06722 నంబర్లలో సంప్రదించి తమపేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పసుమర్తి వెంకటరమణ, కూచిపూడి కళాక్షేత్ర హెచ్ఆర్ కన్నం వెంకటరమణారావు, డాక్టర్ విజయవేణి, వసుధ మాగంటి, రూప తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక మాసోత్సవాలకు ఏర్పాట్లు



ఉత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రామాలయ నిర్వహణ కమిటీ సభ్యులు

**మురళీనగర్:** మురళీనగర్ రామాలయ సముదాయంలో వెలసిన ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, ఎస్.వరప్రసాద్ తెలిపారు. గురువారం ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. ఈ నెల 22 నుంచి నవంబర్ 20 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి రోజూ ఉమా రామలింగేశ్వర స్వామికి ఆలయ అర్చకుడు మంచిలి భానుమూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో విశేష అర్చన, అభిషేకం, సాయంత్రం ఆకాశ దీపారాధన జరుగుతాయన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటలకు ఈశ్వరుడికి పంచామృతాభిషేకం, రాత్రి 7 గంటలకు నందీశ్వరుడికి ప్రదోషకాల విశేష హారతి సమర్పిస్తామని తెలిపారు. ప్రతి నెలా మాస శివరాత్రికి రుద్రాభిషేకం నిర్వమిస్తామని, భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఉమారామలింగేశ్వరులను దర్శించుకోవాలన్నారు. కార్యక్రమంలో రామాలయ నిర్వహణ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

## సేవ్ గర్ల్ చైల్డ్‌పై వ్యాసరచన పోటీ



జీవీఎంసీ హైస్కూల్‌లో సేవ్ గర్ల్ చైల్డ్‌పై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**సీతంపేట:** అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గురువారం సేవ్ గర్ల్ చైల్డ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం జయంతి రాధాకుమారి మాట్లాడుతూ సేవ్ గర్ల్ చైల్డ్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ప్లకార్డులు తయారుచేసి ప్రదర్శించారు. సేవ్ గర్ల్ చైల్డ్ నినాదాలతో ప్రదర్శన కొనసాగింది. అనంతరం పాఠశాల స్థాయిలో సేవ్ గర్ల్ చైల్డ్ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్.గోమతి, కె.లక్ష్మీ శ్రీప్రియ, ఎస్.హర్షవర్ధన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరు శుక్రవారం జరగనున్న మండల స్థాయి వ్యాసరచన పోటీలో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, గ్లోరీ, రత్నం, ఎం.ఎస్.వి.విశ్వనాథం పాల్గొన్నారు.

## రైల్వే ప్రయాణికుల నుంచి సూచనల స్వీకరణ



రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న రైల్వే అధికారులు

**తాటిచెట్లపాలెం:** ప్రత్యేక క్యాంపెయిన్–5లో భాగంగా ప్రయాణికుల భాగస్వామ్యంతో కూడిన అమృత్ సంవాద్ కార్యక్రమాన్ని గురువారం విశాఖ రైల్వే స్టేషన్‌లో నిర్వహించారు. స్టేషన్‌లోని ఏసీ వెయిటింగ్ హాల్స్ వద్ద వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికం ఇంజినీర్ దీప్తాన్షు శర్మ ప్రయాణికులతో మాట్లాడారు. వారి అమూల్యమైన సూచనలు, సలహాలను స్వీకరించారు. రైల్వే అధికారులు, ప్రయాణికులతో జరిపే ప్రత్యక్ష సంభాషణ ప్రక్రియలో భాగమే ఈ అమృత్ సంవాద్. అక్టోబర్ 31 వరకు జరిగే ఈ క్యాంపెయిన్‌లో భాగంగా రైల్వే అధికారులు స్వయంగా ప్రయాణికుల నుంచి పలు సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నారు.

## మహిళల సమస్యలు-పరిష్కారంపై అవగాహన



నర్సింగ్ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వక్తలు

**తాటిచెట్లపాలెం:** సీతమ్మధారలోని డాక్టర్ సత్యవేదం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో గురువారం మహిళల సమస్యలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త డాక్టర్ మ్యాథ్యూ, సుహాసినీ డేనియల్‌లు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో మహిళలపై జరిగే అన్యాయాలు, అకృత్యాలు, లైగింక దాడులు వంటి సమస్యలను ఎలా ఎదుర్కోవాలో తెలియజేశారు. అనంతరం నర్సింగ్ స్కూల్ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## జగనన్న చెంతకు తరలిన జనం

- విమానాశ్రయంలో వైఎస్సార్‌సీపీ అధినేతకు పార్టీ శ్రేణుల ఘన స్వాగతం



సీతంపేట నుంచి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ 25వ వార్డు శ్రేణులు



కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో 51వ వార్డు నుంచి తరలివెళ్తున్న కార్యకర్తలు



బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో బయలుదేరిన 57వ వార్డు ప్రజలు

**సీతంపేట:** ఉమ్మడి విశాఖ పర్యటన, నర్సీపట్నం మాకవరపాలెంలోని మెడికల్ కాలేజీ సందర్శనకు గురువారం విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ ఉత్తర నియోజకవర్గ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. 25వ వార్డు మాజీ కార్పొరేటర్ మువ్వల పోలారావు, మువ్వల సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు సీతంపేట మెయిన్ రోడ్ నుంచి ర్యాలీగా వెళ్లి విశాఖ విమానాశ్రయంలో అధినేత వైఎస్ జగన్‌ను ఘనంగా స్వాగతించారు. సింహాచలం దేవస్థానం బోర్డు మాజీ సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు భోగవిల్లి గోవింద్, సానబోయిన సురేష్, సారిపిల్లి సంతోష్, నూకరాజు, పోతిబంతి హరికృష్ణ, జోరీగల గణేష్, అప్పలరాజు, బోర గోవింద్, సూరిబాబు, సత్యనారాయణ, బొమ్మాలి రవి, బొట్టా పైడిబాబు, పప్పు ప్రసాద్, దిమిలి శ్రీను, బడే శ్రీను, ఈగల గోవింద్, సన్యాసిరావు, జోగా శ్రవణ్, బొట్టా శ్రీను, ముద్దాడ అశోక్, బొట్టా వాసు, నమ్మి మహేష్, రవీంద్ర, శంకర్, ఉమ, జయశ్రీ, వీర రత్నం తదితరులు పాల్గొన్నారు.

**51వ వార్డు నుంచి..**

**మర్రిపాలెం:** జీవీఎంసీ 51వ వార్డు నుంచి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మూడు కార్లు, పది స్కూటర్లు, పది ఆటోల్లో వంద మంది ప్రజలు, కార్యకర్తలు ఉత్సాహంగా విమానాశ్రయానికి చేరుకుని అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పైడి శ్రీను, దిడ్డి రమేష్, పొన్నాడ అప్పారావు మాస్టర్, బుడుమూరు తిరుమలరావు, మెట్ట దమయంతి, కొత్తపల్లి రాని, నిడిగట్టు ధర్మావతి, సారిక, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

**57వ వార్డు నుంచి..**

**కంచరపాలెం:** వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ఆదేశాల మేరకు 57వ వార్డు నుంచి పార్టీ వార్డు ఇన్‌చార్జి బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు విశాఖ ఎయిర్‌పోర్టుకు తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికి జగనన్న నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పినింతి అప్పలరాజు, రేసపు శ్రీనివాస్ రెడ్డి, శరగడం లక్ష్మి, గున్నేశ్వరావు, కె.ధనరాజ్, మహిళా అధ్యక్షురాలు చిన్నారి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కుల చట్టంతో ప్రజలకు న్యాయం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

**విశాఖ–లీగల్:** వినియోగదారుల హక్కుల చట్టం ప్రజలకు న్యాయం అందించడానికి ఒక బలమైన సాధనం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. గురువారం సిరిపురం వీఎంఆర్‌డీఏ మీటింగ్ హాలులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులందరికీ వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరమని, ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో ప్రజలు తమ హక్కులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల ఫోరం–2 జడ్జి వెంకటేశ్వరి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మందుల ధరలు తగ్గించి విక్రయించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

**మహారాణిపేట:** జీఎస్టీ 2.0 ప్రకారం వైద్య ఆరోగ్యశాఖలో పలు మార్పులు సంభవించాయని, అందులో భాగంగా అనేక మందుల ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని, ఆ ధరలకే ఔషధాల విక్రయాలు జరగాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం చిత్రాలయ థియేటర్ దగ్గర జోన్–4 కార్యాలయ భవనం బిల్ జంక్షన్ సమావేశ మందిరంలో జీఎస్టీ 2.0 మీద ప్రైవేట్ ఆస్పత్రులు, ఇన్సూరెన్స్ యాజమాన్యంతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 5 శాతం అత్యవసర మందుల ధరలు తగ్గించారని అన్నారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్స్ నిర్వాహకులు మారిన ధరల అమలుకు సహకరించాలన్నారు. ఈ సమావేశాం అనంతరం ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ బిల్ జంక్షన్ సమావేశ మందిరం నుంచి జగదాంబ కూడలి మీదుగా తిరిగి బిల్ జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఆర్.రమేష్, కమిషనర్ సీతాలక్ష్మి, జీఎస్టీకి చెందిన శ్రీనివాస్, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, నోడల్ అధికారులు ఐ.వి.దిలీప్, పి.వి.అభినవ్, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బధిరుల సమస్యలు, సేవలపై అవగాహన

**మహారాణిపేట:** బధిరులకు ఎదురయ్యే సమస్యలు, వారి అవసరాలు, వారికి అందాల్సిన వైద్య సేవలపై గురువారం రేసవానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఇంటర్నేషనల్ వీక్ ఆఫ్ డెఫ్ పీపుల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హారిక అధ్యక్షత వహించారు. 'చూపులతో మాట్లాడే వారి కోసం మనం వినిపించాలి' అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సలహాదారు వి.లక్ష్మి ప్రత్యేక శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ మెడికల్ ఆఫీసర్లు, ఫిజియో థెరపిస్టులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నిరాశ్రయ వసతి గృహాలకు అండగా నిలవాలి



ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవంలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి తదితరులు

**అల్లిపురం:** స్వచ్ఛంద సంస్థలు నిరాశ్రయ వసతి గృహాలకు, పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు అండగా నిలవాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా కేఎస్ఆర్ బ్యాడ్మింటన్ అకాడమీ సభ్యులు, ఎంవీపీ సెక్టర్–6, హెల్త్ ఎరీనా ప్రతినిధులు గురువారం నిరాశ్రయులకు నిత్యావసర సరకులు సీపీ చేతుల మీదుగా అందజేశారు. నిరాశ్రయులకు బాసటగా నిలుస్తున్న ఏయూటీడీ లాంటి సంస్థలకు, పోలీస్ డిపార్టమెంట్‌కు దాతలు అండగా నిలవాలని సీపీ కోరారు. నిరాశ్రయుల దినోత్సవం రోజున సహాయం అందించిన అకాడమీ సభ్యులు సుందర రామరాజు బృందాన్ని అభినందించారు. దాతలను సమీకరించిన 2 టౌన్ సీఐ ఎర్రంనాయుడు, సిబ్బందిని అభినందించారు. నిరాశ్రయులు, షెల్టర్ సిబ్బంది, దాతలకు ధన్యవాదాలు తెలిపారు. అకాడమీ సభ్యులు జి.ఎస్.ఎన్ రాజు, సత్యనారాయణ, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, స్వరూప్ పాల్గొన్నారు.